ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
బుధవారం 15 మే 2024



72.54 శాతం పోలింగ్ - 8లో..

'డబుల్' సమస్యలు
- పగుళ్లు చూపిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు - 8లో..

పోలింగ్‌పై లెక్కలు

- రెండు సెగ్మెంట్లలో 4,72,735 మంది ఓటర్లు
- పోలైనవి 3,53,935
- అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్న మహిళలు
- ఫలితాలపై పార్టీల నేతల తర్జనభర్జన
- మెజార్టీపై ఎవరి విశ్వాసం వారిదే
- సిరిసిల్ల, వేములవాడలో ఉత్కంఠమైన చర్చ



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

పార్లమెంట్ పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఓటరన్న తీర్పు ఇచ్చి మౌనం దాల్చాడు. ప్రధాన పార్టీల నేతలు లెక్కల్లో పడ్డారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో సోమవారం ముగిసిన పోలింగ్ సరళిలో ఏ పార్టీ వైపు మొగ్గు చూపారు. ఓటు ఏవరికి వేశారు. ఎన్నికల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలవబోతున్నాడు? అని బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు మంగళవారం లెక్కలు కడుతూ కనిపించారు. పార్టీలోని ముఖ్య నాయకులు, బూత్‌స్థాయి నాయకులతో చర్చలు ప్రారంభించారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సైతం సిరిసిల్లకు వచ్చి జిల్లా పార్టీ కార్యాలయంలో పోలింగ్‌పై ఆరా తీశారు. కాంగ్రెస్‌కు సంబంధించి వేములవాడ నియోజకవర్గంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్లలో నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, బీజేపీకి సంబంధించి ఆ పార్టీ ముఖ్య నాయకులు రాబోయే ఫలితాలపై చర్చించుకున్నారు. ఫలితాలు జూన్ 4న వెలువడనుండడంతో అన్ని రోజులు పార్టీ నాయకులకు ఉత్కంఠత తప్పడం లేదు. సర్వేల లెక్కలు చూసి ఎవరికి వారు సిరిసిల్ల, వేములవాడలో తమకే ఓటింగ్ శాతం ఎక్కువగా వస్తుందని భావిస్తున్నారు. మోదీ హవాతో బీజేపీకి గతంలో కంటే ఈ సారి ఓటింగ్ శాతం పెరుగుతుందని భావిస్తున్నారు. బీఆర్‌ఎస్‌కు సిరిసిల్లలో దీమాగా ఉండగా వేములవాడలో కాంగ్రెస్ నాయకులు ఓటింగ్ శాతం అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. రెండు సెగ్మెంట్లలో బీజేపీకే పలితాలు అనుకూలంగా ఉంటాయనే ధీమాతో నేతలు కనిపిస్తున్నారు.

● పెరిగిన ఓటింగ్ శాతంతో ఎవరికి లాభం?

సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో 2019 పార్లమెంట్ ఎన్నికల కంటే ఈ సారి ఓటింగ్ శాతం పెరిగింది. 2019లో సిరిసిల్ల సెగ్మెంట్‌లో 71.80 శాతం, వేములవాడలో 70.68 శాతం ఓటింగ్ జరిగింది. ఈసారి ఓటింగ్‌లో సిరిసిల్లలో 75.27 శాతం, వేములవాడలో 74.44 శాతం నమోదైంది. పెరిగిన ఓట్లు ఎవరికి లాభం చేకూరుస్తారనే దానిపైనా చర్చ సాగుతోంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో 1,63,550 ఓట్లు పోల్ అవగా కాంగ్రెస్‌కు 18,733 ఓట్లు, బీజేపీకి 64,769 ఓట్లు, బీఆర్‌ఎస్‌కు 70,482 ఓట్లు లభించాయి. వేములవాడలో 1,45,641 ఓట్లు పోల్ అవగా కాంగ్రెస్‌కు 15,606 ఓట్లు, బీజేపీకి 73,290 ఓట్లు, బీఆర్ఎస్‌కు 47,399 ఓట్లు పోల్ అయ్యాయి. ఈ సారి జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లోనూ బీజేపీకే అనుకూలంగా ఓట్లు వస్తాయనే ఆశాభావంతో ఉన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో వేములవాడలో కాంగ్రెస్, సిరిసిల్లలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గెలుపొందారు. దీని ప్రకారం తమకే అనుకూలంగా ఉంటుందనే ధీమా కూడా ఆ పార్టీ నేతల్లో కనిపిస్తోంది.

● మహిళల ఓటింగే అధికం

సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. ఓటు హక్కు కూడా వారే అధికంగా వినియోగించుకున్నారు. జిల్లాలో మహిళా ఓటర్లు 2,44,156 మంది ఓటర్లు ఉండగా 1,89,169 మంది ఓటు వినియోగించుకున్నారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 1,26,791 మంది మహిళా ఓటర్లు ఉండగా 96,847 మంది ఓటు వేశారు. పురుషుల కంటే 8125 మంది అధిక ఓటింగ్ జరిగింది. వేములవాడలో 1,18,065 మంది మహిళా ఓటర్లు ఉండగా 92,322 మంది ఓటు వేశారు. పురుషుల కంటే 16,282 మంది మహిళలు అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

● రెండు సెగ్మెంట్లలో 3,53,935 ఓట్ల పోలింగ్

సిరిసిల్ల, వేములవాడ రెండు నియోజకవర్గాల్లో 4,72,735 మంది ఓటర్లు ఉండగా 3,53,935 ఓట్లు పోలయ్యాయి. సిరిసిల్ల నియోజకవర్గంలో 2,46,547 ఓటర్లు ఉండగా, 1,85,573 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 1,19,749 మంది ఓటర్లకు 88,722 మంది ఓటు వేశారు. మహిళలు 1,26,791 మంది ఓటర్లు ఉండగా 96,847 మంది తమ ఓటు వేశారు. వేములవాడ సెగ్మెంట్లలో 2,26,188మంది ఓటర్లు ఉండగా 1,68,373 మంది ఓటు వేశారు. ఇందులో పురుషులు 1,08,091 మందికి 76,040 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళలు 1,18,065 మంది ఉండగా 92,322 మంది ఓటు వేశారు.

స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత

- కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్ట్రాంగ్ రూముల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పూర్తికాగానే కరీంనగర్, చొప్పదండి మానకొండూర్, హుజూరాబాద్ హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాలకు సోమవారం అర్ధరాత్రి వరకు చేరుకున్నాయి. పటిష్టమైన భద్రత మధ్య ప్రత్యేక వాహనాల్లో అధికారులు ఈవీఎంలను తరలించారు. మంగళవారం ఉదయం ఈవీఎంలను స్ట్రాంగ్ రూం లకు తరలించారు. స్ట్రాంగ్ రూాలలో ఈవీఎంలను కలెక్టర్ పమేలా సత్పతి, ఎన్నికల సాధారణ పరిశీలకులు ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా పరిశీలించారు. ఈవీఎంలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను వేర్వేరు గదుల్లో భద్రపరిచి సీల్ వేసి తాళాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూంల వద్ద నిరంతరం నిఘా ఉండేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్‌యాదవ్, ఆర్డీవోలు కె మహేశ్వర్, రమేష్‌బాబు, రామ్మూర్తి, ఏసీపీలు సతీష్‌బాబు, శ్రీనివాస్‌జీ, రాజకీయ పార్టీల నాయకులు సత్తినేని శ్రీనివాస్, మడుపు మోహన్, ఎస్‌కే సిరాజ్ హుస్సేన్, కొమురయ్య, బండ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల వారీగా పోలింగ్ వివరాల సేకరణ

ఇల్లంతకుంట, మే 14: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి గ్రామాల వారీగా పోలింగ్ వివరాలను మండల నాయకులు సేకరిస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పదిరోజులపాటు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పోలింగ్ ముందురోజు ఓటర్లను ఆకట్టుకోవడానికి అన్నివిధాలుగా ప్రయత్నించారు. పోలింగ్ కేంద్రాలకు ఓటర్లను తరలించడానికి వాహనాలు ఏర్పాటు చేశారు. అన్నిగ్రామాల నాయకులకు మంగళవారం ఫోన్లు చేసి ఎన్ని ఓట్లు పోలయ్యాయి? పరిస్థితి ఎలా ఉంది? అంటూ ఆరా తీస్తున్నారు. తమ పార్టీకే మండలంలో ఎక్కువ ఓట్లు వస్తాయని అన్నిపార్టీల నాయకులు పైకి గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా లోపల మాత్రం భయపడుతున్నారు. తక్కువ ఓట్లు వస్తే అధిష్ఠానం దృష్టిలో చులకనవుతామని ఆందోళన చెందుతున్నారు.

ఎల్లమ్మ సిద్దోగం వేడుకలకు ఆహ్వానం



పత్రిక అందజేస్తున్న గౌడ సంఘం నాయకులు

గంభీరావుపేట, మే 14 : రేణుకా ఎల్లమ్మ సిద్దోగం వేడుకలకు రావాలని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్‌ను గంభీరావుపేట గౌడ సంఘం నాయకులు ఆహ్వానించారు. మంగళవారం సిరిసిల్లకు వచ్చిన కేటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో గంభీరావుపేట గౌడ సంఘం నాయకులు కలిశారు. సిద్దోగం వేడుకల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 26 నుంచి ఎల్లమ్మ సిద్దోగం ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వివరించారు. గౌడ సంఘం నాయకులు చేరాల రాజాగౌడ్, పాపగారి వెంకటస్వామి, చేరాల వెంకటస్వామి. పాపగారి యాదగిరి, పాపగారి శ్రీనివాస్, గొల్లపల్లి నాగరాజు, గొల్లపల్లి నరేష్, పాపగారి అక్షయ్ నారాయణ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు భద్రత ఏదీ?

- పని ప్రదేశాల్లో సౌకర్యాలు కరువు

- రెండు నెలలుగా అందని కూలి



కోనరావుపేటలో పనిచేస్తున్న కూలీలు

కోనరావుపేట, మే 14: కూలీలకు వలసలు నివారించి గ్రామాల్లో పని కల్పించాలని ఉద్దేశంతో ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వం కూలీలకు పని కల్పించాలనే ఉద్దేశం బాగానే ఉన్నప్పటికీ పని చేసే ప్రదేశాల్లో మంచినీటి సౌకర్యంతో పాటు టెంట్లు ప్రథమ చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అధికారులు పని ప్రదేశాల్లోకి వెళ్లకపోవడం, పని జరిగే చోట వసతులు కల్పించకపోవడం వంటివాటితోపాటు వేసవిలో ఎండలకు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రెండు నెలలు గడిచినా ఇంతవరకు ఉపాధి హామీ కూలి డబ్బులు చెల్లించకపోవడంతో కూలీలు కుటుంబ పోషణకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గతంలో కూలీలకు ప్రభుత్వమే పనిముట్లను అందజేసింది. ఇప్పుడు ఆ పనిముట్లను కూడా అందజేయడం లేదని కూలీలు పేర్కొంటున్నారు. పని జరిగే ప్రాంతంలో వసతులు కలించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉపాధిహామీ పనులు చేస్తుండగా వడదెబ్బకు కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు. పని జరిగే ప్రాంతంలోకి అధికారులు వెళ్లకుండా సీనియర్ మేట్లకే పనులు అప్పజెప్పి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని, పని ప్రాంతాల్లో వసతులు కల్పించి కూలీ డబ్బులు చెల్లించాలని కోరుతున్నారు.

దారికి అడ్డుగా వాహనాలు

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

- రోగుల ఇబ్బందులు



కేంద్రంలోకి వెళ్లకుండా అడ్డుగా ఉన్న వాహనాలు

కోనరావుపేట, మే 14: కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్‌లు అడ్డుగా పెట్టడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోపలికి వెళ్లడానికి అవస్థలు పడుతున్నారు. నిత్యం పలు సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు, వివిధ కార్యాలయాలకు వచ్చిన ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాహనాలు పెట్టడంతో ఇక్కడి సిబ్బందికి, రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎమర్జెన్సీ సమయంలో అంబులెన్స్ వెళ్లడానికి కూడా ఆస్కారం లేకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అడ్డుగా వాహనాలను పెడుతున్నారు. దీంతో వైద్య బృందానికి, ఇటు రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వాహనాలు పెట్టకుండా చూడాలని రోగులు కోరుతున్నారు.

చెరువు పూడికతీత పనులు ప్రారంభం



మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు

రుద్రంగి, మే 14: రుద్రంగి మండల కేంద్రంలోని గోలెపులొద్ది చెరువులో రూ.10 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పూడిక తీత పనులను అధికారులు మంగళవారం ప్రారంభించారు. చెరువులో నీరు నిలిచేందుకు వీలు లేకపోవడంతో రైతుల దరఖాస్తు చేసుకున్నారు. దీంతో అధికారులు చెరువులో పూడికతీత పనులకు ప్రతిపాదనలు పంపారు. మండల కేంద్రంలోని గోలెపులొద్ది చెరువులో 50 మంది కూలీలతో చెరువు పూడిక తీసి మట్టిని రైతుల పొలాలకు తరలించనున్నట్లు ఉపాధిహామి సిబ్బంది తెలిపారు.

దర్గాలో కేటీఆర్ ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న కేటీఆర్

ఎల్లారెడ్డిపేట, మే 14: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం శివారులోని దర్వేషావలి దర్గాలో ఉర్సు ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అంతకుముందుకు ఉర్సు ఉత్సవ కమిటీ నిర్వాహకుడు అజీజ్ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ మధు, మాజీ సర్పంచ్ నర్సాగౌడ్, నాయకులు సుభాష్, దేవరాజు, స్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

- ఇసుక స్మగ్లర్ల ఇష్టారాజ్యం

- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు



నిల్వ చేసిన ఇసుక కుప్పలు

ఎల్లారెడ్డిపేట, మే 14: మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఇసుక స్మగ్లర్లు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్న చందంగా మారింది. మండలంలోని నారాయణపూర్, సింగారం, బండలింగంపల్లి, వెంకటాపూర్, రాగట్లపల్లి తదితర గ్రామాల శివారులోని మానేరు వాగులో ఇసుక వ్యాపారులు దర్జాగా ఎక్స్‌కవేటర్‌తో తోడేస్తున్నారు. చీకటి పూట తవ్వి వాగు సమీపంలో భారీ స్థాయిలో నిల్వ చేస్తున్నారు. వాగులో నీరు ఉండడం వల్ల కూలీలతో ఇసుకను తీయడం వ్యాపారులకు ఇబ్బందిగా మారడంతో ఎక్స్‌కవేటర్ ద్వారా ఇసుక తవ్వుతున్నారు. ఉదయం పూట అనుమతుల మాటున ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డు వెళ్లిన వారిపై ఇసుక స్మగ్లర్లు దాడులకు దిగుతున్నారు. ఇసుక అక్రమ రవాణా సంబంధిత శాఖ అధికారుల కనుసన్నల్లోనే సాగుతోందనే ఆరోపణలున్నాయి. ఒక్కో ఇసుక ట్రాక్టర్‌కు రూ.5 వేల నుంచి రూ.10 వేలు పుచ్చుకుని పచ్చజెండా ఊపుతున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. ఇటీవల నారాయణపూర్‌లో ఓ వ్యక్తిపై ఇసుక స్మగ్లర్లు దాడికి పాల్పడితే ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని సదరు బాధితుడు వాపోతున్నాడు. ఇప్పటికైనా మానేరు వాగులో ఎక్స్‌కవేటర్‌తో తవ్వుతూ అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ రామచంద్రంను వివరణ కోరగా నారాయణపూర్ సమీపంలోని మానేరు వాగు నుంచి రాత్రి పూట ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను తోడి నిల్వ చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని అన్నారు. ఇసుకను తవ్వుతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించామన్నారు. ఎస్‌ఐ రమాకాంత్‌ను వివరణ అడుగగా అనుమతులు లేకుండా ఇసుకను తరలింపుపై ప్రత్యేక నిఘాను తీవ్రతరం చేశామని పేర్కొన్నారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ రమాకాంత్ హెచ్చరించారు.

బస్సు యాత్రతో దిగి వచ్చిన జాతీయ పార్టీలు

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేటీఆర్


సిరిసిల్ల టౌన్, మే 14 : కేసీఆర్ బస్సు యాత్ర ఒక మలుపు తిప్పింది. 17 రోజుల బస్సు యాత్రతో రెండు జాతీయ పార్టీలు దిగిరాక తప్పలేదు. జాతీయ నాయకులు తెలంగాణ చుట్టూ గింగిరాలు కొట్టక తప్పని పరిస్థితి నెలకొంది' అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారకరామారావు అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యమైన పద్ధతిలో ఓడిపోయామని, తర్వాత కొందరు స్వార్థపరులు పార్టీని వీడినా బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులు మొక్కవోని ధైర్యంతో పని చేశారని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం, పోలీసులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా బీఆర్‌ఎస్ గెలవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించారని, సోషల్ మీడియా ద్వారా సైనికుల్లా పని చేశారని అన్నారు. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. కేసీఆర్ బస్సు యాత్రను విజయవంతం చేసిన పార్టీ నాయకత్వంకు కృతజ్ఞతలు చెప్పారు. కేసీఆర్ బస్సు యాత్రతో ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు గులాబీ సైన్యంలో గుండెనిండా ఆత్మవిశ్వాసం కనిపించిందన్నారు. బస్సు యాత్రతో రెండు జాతీయ పార్టీలకు ముచ్చెమటలు పట్టించామన్నారు. కొత్త జిల్లాలను రద్దు చేయాలని, కేసీఆర్ ఆనవాలు లేకుండా చేయాలనే చిల్లర ప్రయత్నం ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకతను పెంచిందన్నారు. ఆరు గ్యారెంటీలు 100 రోజుల్లో అమలు చేస్తామని మొత్తం 420 హామీలు ఇచ్చి వాటిని తుంగలో తొక్కారన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ మీద ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత కనిపించిందన్నారు. రైతు భరోసా పేరిట అన్నదాతలను మోసం చేశారన్నారు. రైతు బంధు వేయలేదని, విద్యుత్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని మండిపడ్డారు. క్వింటాల్‌కు రూ.500 ఇస్తామని మోసం చేసినందుకు రైతుల భంగుమంటున్నారని, ఆ వ్యతిరేకత ఓట్ల రూపంకంగా గ్రామీణ ప్రాంతాలలో కనిపిస్తుందని అన్నారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి తారీఖులు చెప్పి మాటమార్చిన విధానం కాంగ్రెస్‌ను నమ్మలేని పరిస్థితి తీసుకొచ్చిందన్నారు. రైతాంగం అంతా కేసీఆర్ ఉన్నపుడే బాగుండే అని, ఈ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టాలని అనుకున్నారని అన్నారు. రాష్ట్రంలోని ఆడబిడ్డలలో కూడా కాంగ్రెస్‌పై తీవ్రమైన వ్యతిరేకత కనిపించిందన్నారు. వంద రోజుల్లో 18 సంవత్సరాలు నిండిన కోటి 67లక్ష మంది ఆడబిడ్డలకు నెలకు రూ.2500 ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. తులం బంగారం, స్కూటీలు, రూ.4 వేల పింఛన్ అని చెప్పి మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీళ్లకు బిందెలు పట్టుకొని రోడ్డునెక్కే పరిస్థితిని ఈ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. బీజేపీపైనా రాష్ట్ర ప్రజల్లో సానుకూత లేదన్నారు. నలుగురిని ఎంపీగా గెలిపించినా వారితో ఒరిగింది ఏమీలేదన్నారు. పూర్తి స్థాయిలో ప్రజలకు అర్థమైందన్నారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పిరమైన తరువాత మోదీ ప్రభుత్వంపై కూడా వ్యతిరేకత కనిపిస్తోందన్నారు. ప్రతీ నియోజకవర్గంలో సామాజికంగా బలమైన 17 మంది అభ్యర్థులను నిలిపామన్నారు. కాంగ్రెస్, బీజేపీ రాజకీయం చూస్తే ఢిల్లీలో కుస్తీ, గల్లీలో దోస్తీ వ్యవహారం నడుస్తోందని ఆరోపించారు. తెలంగాణలో ఆరు, ఏడు సీట్లలో కాంగ్రెస్ బలహీనమైన డమ్మీ అభ్యర్థులను పెట్టి రేవంత్‌రెడ్డి బీజేపీని గెలిపించడానికి కిషన్‌రెడ్డి కంటే రేవంత్‌రెడ్డి ఎక్కువగా కష్టపడ్డారని ఎద్దేవా చేశారు. దేశంలో ఇండియా, ఎన్‌డీఏ కూటమిలకు స్పష్టమైన మెజార్టీ వచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ప్రాంతీయ పార్టీలు హవా కొనసాగనున్నట్లు చెప్పారు. ప్రాంతీయ పార్టీలే శక్తిగా నిర్ణయాత్మక పాత్రను పోషిస్తాయన్నారు. కాంగ్రెస్ ఐదు నెలలుగా ప్రభుత్వాన్ని టైంపాస్‌గా నడిపిందన్నారు. తమ నాయకులను కొందరిని గుంజుకున్నా పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ క్యాడర్ పోరాట ప్రతిమను ప్రదర్శించిందన్నారు. ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించబోతున్నామన్నారు. తెలంగాణ ప్రజలకు ఒక విషయం స్పష్టమైందని, ఈనాడు అయినా ఏనాడైనా బీఆర్‌ఎస్ తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన వరకు శ్రీ రామరక్ష అని అర్థమైందన్నారు. రెండు జాతీయ పార్టీలు సన్నాయి నొక్కులు నొక్కడానికి విమర్శలు చేయడానికి కేసీఆర్‌ను దూషించడానికి పరిమితమయ్యాయని మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో కార్యకర్తలు నాయకులు చేసిన కృషి ఉత్తగనే పోదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికలు బలమైన పునాది కానున్నాయన్నారు. బీఆర్‌ఎస్ అత్యధిక సీట్లు సాధించిన పార్టీగా నిలబడబోతోందన్నారు. ఎన్నికల్లో తమకు ఓట్లు వేసిన ప్రజలకు, అహర్నిశలు కష్టపడి పనిచేసి గులాబీ సైనికులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి, వైస్ చైర్మన్ సిద్ధం వేణు, నాఫ్‌స్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీన్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే విజయభాస్కర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటగా పాఠశాల డైనింగ్ హాల్


హన్మాజీపేట పాఠశాలలోని డైనింగ్ హాల్‌పై లేచిన రేకులు


వేములవాడ రూరల్, మే 14: నూతనంగా నిర్మించిన పాఠశాల డైనింగ్ హాల్ పరిస్థితి మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. వేములవాడ రూరల్ మండలంలో పలు పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం మధ్యాహ్న భోజనం చేసేందుకు వీలుగా డైనింగ్ హాల్‌లను నిర్మించారు. హన్మాజీపేట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సైతం దాదాపు రూ.14 లక్షల ఎంపీఎంటీ నిధులతో డైనింగ్ హాల్ నిర్మాణం చేపట్టారు. మూడు నెలల క్రితం ప్రారంభించారు. ఇటీవల గాలిదుమారంతో కురిసిన వర్షానికి డైనింగ్ హాల్ రేకులు ఎగిరిపోయాయి. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో అధికారులు పరిస్థితిని గమనించడంలేదని స్థానికులు తెలిపారు. వర్షాలు కురిస్తే నీరు మొత్తం డైనింగ్ హాల్‌లోకి చేరుతుందని పేర్కొన్నారు. పాఠశాల తిరిగి ప్రారంభం కాకముందే డైనింగ్ హాల్ రేకులను తిరిగి అమర్చాలని కోరుతున్నారు.













నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో..
పెరిగిన పోలింగ్ శాతం

- 71.92 శాతం నమోదు
- ఈ ఎన్నికల్లో అత్యధికంగా ఓటు వేసిన మహిళలు
- నిజామాబాద్ అర్బన్‌లో పెరిగిన ఓటింగ్


స్ట్రాంగ్ రూంకు సీల్ వేస్తున్న అధికారులు


స్ట్రాంగ్ రూంలో ఈవీఎంలను పరిశీలిస్తున్న అధికారులు

నిజామాబాద్, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరిగింది. గత ఎన్నికల కన్నా పోలింగ్ ఎక్కువైంది. అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు ఓటర్లకు విజ్ఞప్తి చేయడంతో ఈ శాతం పెరిగింది. గత ఎన్నికలకంటే 3.57 శాతం పోలింగ్ ఎక్కువగా జరిగింది. నిజామాబాద్ అర్బన్‌లోనూ గత పార్లమెంట్ ఎన్నికలకంటే ఎక్కువగా పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో యువత నుంచి వృద్ధుల వరకు పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంతో శాతం పెరిగింది. మహిళలు కూడా ఈ ఎన్నికల్లో ఎక్కువ శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలైన మొత్తం ఓటర్లలో మహిళా ఓటర్లే అత్యధికంగా ఓటు వేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఈవీఎంలు వచ్చిన తర్వాత తుది పోలింగ్ శాతాన్ని అధికారులు విడుదల చేశారు.

● ఓటు హక్కు వినియోగించుకున్న 12,26,133 మంది..

ఈ ఎన్నికల్లో పోలింగ్ జరగడంతో ఓటర్లు కూడా ఎక్కువ మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లో 17,04,867 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 12,26,133 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువగా జరగగా 10,61,622 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆ ఎన్నికల్లతో పోలిస్తే 1,64,511 మంది ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో మహిళలే ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 8,06,130 మంది ఉండగా, 5,52,465 మంది ఓటు వేశారు. మహిళా ఓటర్లు 8,98,647 మంది ఉండగా 6,73,629 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషుల కంటే 1,21,164 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇతరులు 90 మంది ఉండగా వారిలో 39 మంది ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో ఆర్మూర్ నియోజకవర్గంలో 2,12,145 మంది ఓటర్లు ఉండగా 1,55,159 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బోధన్‌లో 2,23,096 మంది ఉండగా 1,66,330 మంది, నిజామాబాద్ అర్బన్‌లో 3,04,317 మంది ఉండగా 1,88,159 మంది, నిజామాబాద్ రూరల్‌లో 2,56,593 మంది ఉండగా 1,91,252 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాల్కొండలో 2,26,792 మంది ఉండగా 1,69,524 మంది ఓటు వేశారు.కోరుట్ల నియోజకవర్గంలో 2,45,249 మంది ఓటర్లు ఉండగా 1,80,867 మంది, జగిత్యాలలో 2,36,675 మంది ఉండగా 1,74,842 మంది ఓటు వేశారు. ఈ ఎన్నికలు అధికారులు ఛాలెంజ్‌గా తీసుకొని పనిచేయగా ఓటర్లు కూడా ఎండను సైతం లెక్కచేయకుండా పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల కమిషన్ అవగాహన కార్యక్రమాలు, అధికారులు చేపట్టిన కార్యక్రమాలు, వివిధ సంఘాలు, రాజకీయ పార్టీలు తీసుకున్న నిర్ణయాల వల్ల పోలింగ్ శాతం పెరిగింది. జిల్లాలో యంత్రాంగం తరపున చేపట్టిన అన్ని కార్యక్రమాలతో పోలింగ్ శాతం పెరిగినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ మొదలైనప్పటి నుంచి పోలింగ్ బూత్‌ల వారిగా ఏర్పాటు చేయడం, ఓటు నమోదు చేయడం, లిస్టుల పంపిణీ చేయడం వల్ల ఇది సాధ్యమైందని ఆయన తెలిపారు. ప్రజలు సహకరించి పోలింగ్ కేంద్రాలకు పెద్ద ఎత్తున వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు.


స్ట్రాంగ్ రూం వద్ద భద్రత

● బాల్కొండలో అత్యధికం..

నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో ఈ దఫా పోలింగ్ శాతం భారీగా పెరిగింది. ఈ ఎన్నికల్లో 71.92 శాతం పోలింగ్ నమోదైంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో 68.37 శాతం నమోదైంది. ఆ ఎన్నికల్లతో పోలిస్తే ఎక్కువగా జరిగింది. నిజామాబాద్ అర్బన్‌లోనూ పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈ పోలింగ్ శాతం పెరగడానికి ఓటర్లు ఎక్కువగా పోలింగ్ కేంద్రాలకు రావడం వల్లనే జరిగింది. పార్లమెంట్ పరిధిలోని ఆర్మూర్‌లో 73.14 శాతం, బోధన్‌లో 74.56 శాతం, నిజామాబాద్ అర్బన్‌లో 61.83 శాతం, నిజామాబాద్ రూరల్‌లో 74.54 శాతం, బాల్కొండలో 74.75 శాతం, కోరుట్లలో 73.75 శాతం, జగిత్యాలలో 73.85 శాతం పోలింగ్ నమోదైంది. నిజామాబాద్ అర్బన్‌లో గత ఎన్నికల్లకంటే ఎక్కువగా పోలింగ్ శాతం పెరిగింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో అర్బన్‌లో 56.25 శాతం నమోదు కాగా ఈ దఫా 5.68 శాతం పెరిగింది. ఈ ఎన్నికల్లో కొత్త ఓటర్లతో పాటు మహిళలు, వృద్ధులు ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. గ్రామాల్లో పట్టణాల కంటే ఎక్కువగా ఓటర్లు తరలివచ్చి ఓటు వేశారు. మున్సిపాలిటీల పరిధిలో పోలింగ్ శాతం కొద్దిగా మెరుగుపడ్డ గ్రామీణ ప్రాంతంతో పోల్చుకుంటే తక్కువగా పోలింగ్ జరిగింది. ఈ పోలింగ్ శాతం పెరిగేందుకు జిల్లా అధికారులతో పాటు రాజకీయ పార్టీల నేతలు కూడా ప్రయత్నాలు చేశారు. ఎన్నికల ప్రచారంలో ఓటు వేయాలని ఎక్కువగా కోరడంతో ఈ పోలింగ్ శాతం గత ఎన్నికలకంటే పెరిగింది.

చెరువులు, కాలువల మరమ్మతుకు మోక్షం లభించేనా?

- గత వర్షాకాలంలో చెరువులకు గండ్లు
- ఎన్నికల కోడ్‌తో నిలిచిన నిధుల కేటాయింపు
- నిరాశలో రైతాంగం

కథలాపూర్, మే 14: గడిచిన ఏడాది కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల కాలువలకు గండ్లు పడి నీరంతా వృధాగా పోయింది. దీంతో వాగులకు పక్కన ఉన్న భూములు కోత గురికావడమే కాకుండా పంటలన్నీ కొట్టుకుపోయాయి. రైతులకు విపరీతమైన నష్టం జరిగింది. ఈ నేపథ్యంలో వాటిని మరమ్మతులు చేయాల్సిన అవసరం ఏర్పడగా నిధుల కేటాయింపుకు ఎన్నికల కోడ్ గండంలా వచ్చి పడింది. ఈ కారణంగా చెరువులు, కుంటల మరమ్మత్తులకు మోక్షం లభించే పరిస్థితి కనిపించకపోవడంతో రైతాంగం తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురవుతోంది.

● నిధుల కేటాయింపునకు లభించని మోక్షం..

మండలంలోని గంభీర్‌పూర్‌కు భూగర్భ జలాలను పెంచడానికి ఎంతో ఉపయుక్తంగా ఉన్న కొచ్చెరువు గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు గండి పడడంతో నీరంతా వృధాగా పెద్దవాగులో పడిపోయింది. వరద తాకిడికి బొమ్మెన, తక్కళ్ళపల్లి, దూలూరు గ్రామాలకు చెందిన వాగును ఆనుకుని ఉన్న భూములు భారీ కోతకు గురయ్యాయి. సారవంతమైన భూములు కొట్టుకుపోయాయి. ఇరిగేషన్ అధికారులు చెరువును సందర్శించి అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నిధుల విడుదల కోసం నివేదికలు పంపించారు. ఆగస్టు మాసంలో చెరువుకు గండిపడగా సెప్టెంబరులో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో నిధుల విడుదలకు ఆటంకం ఏర్పడింది. డిసెంబర్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరినప్పటికీ నిధుల కటకట ఏర్పడ్డ విషయం తెలిసిందే. అసెంబ్లీ సమావేశాల అనంతరం ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన కోడ్ అడ్డు వచ్చింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో నిధుల కేటాయింపునకు మోక్షం లభించకుండా పోయిందని రైతాంగం వాపోతున్నారు.


గంభీర్‌పూర్ కొచ్చెరువుకు ఏర్పడ్డ గండి

అదేవిధంగా వర్షాలకు రాళ్ళవాగు ప్రాజెక్ట్ కుడి కాలువకు గండి పడ్డ క్రమంలో నీరు ఆత్మకూర్ వాగులోకి వృధాగా పోయింది. కాలువ చివరి భూములకు నీరు రాని పరిస్థితి ఎదురై భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోయాయి. ఈ గండి పూడ్చడం, ఇతరత్రా మరమ్మతుల కోసం అధికారులు రు. 38 లక్షలతో అంచనాలు రూపొందించి నివేదిక సర్కారుకు పంపించారని తెలిసింది. వర్షాకాలం మరో 20 రోజుల్లో ఆరంభం కానున్నందువల్ల ఈ ఏడాది మరమ్మతులు జరిగే పరిస్థితి కనిపించడం లేదని రైతాంగం ఆందోళన చెందుతోంది. గండ్లు పూడ్చకపోతే ఈ ఏడాది నీరంతా వృధాగా పోక తప్పదని పేర్కొంటున్నారు.

● చివరి భూములకు నీరందే పరిస్థితి లేదు



- రాజరెడ్డి, రైతు కథలాపూర్

ప్రాజెక్ట్ కుడి కాలువకు గండి పడగా నీరు వాగులోకి వృధాగా పోయింది. దీనివల్ల చివరి భూములకు నీరు రాక ఎంతో ఇబ్బందులు పడ్డాం. బావులు, బోర్లలో నీరు అడుగంటి పంటలు రబీ సీజన్‌లో ఎండిపోయాయి. కాలువలో నీరుంటే పంటలకు ఢోకా ఉండేది కాదు. కాలువకు చివరన ఉన్న మాలాంటి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తే బాగుండేది.

● ప్రత్యేక నిధులు కేటాయించాలి



- పిడుగు తిరుపతిరెడ్డి, బొమ్మెన

గండ్లు పడ్డ చెరువులు, కుంటలు, కాలువల మరమ్మతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి త్వరగతి పనులు పూర్తి చేయాలి. ఎన్నికలు పూర్తయినందు వల్ల ప్రభుత్వం నిధులు విడుదల చేసి యుద్ధప్రాతిపదికన పనులు చేపడితే నీరు వృధాగా పోకుండా అరికట్టడానికి అవకాశం ఉంది. మరికొద్ది రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో మరమ్మతులు చేపడితే రైతులకు న్యాయం జరుగుతుంది.



బెస్ట్ అవైలబుల్ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

గణేశ్‌నగర్, మే 14: 2024-25 విద్యా సంవత్సరానికి అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ జూనియర్ కళాశాలలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు న్యాతనియల్ తెలిపారు. మార్చి2024లో పదో తరగతిలో ఏడు జీపీఏ ఆపై గ్రేడు పొందిన విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ప్రభుత్వ షెడ్యూల్డ్ కులముల వసతి గృహాలు/ఆశ్రమ పాఠశాలలు/ కస్తూర్బా పాఠశాలలు, ప్రభుత్వ, మున్సిపల్, జిల్లా పరిషత్, ఎయిడెడ్ పాఠశాలలో చదివిన విద్యార్థులు (డీ స్కాలర్స్), ప్రభుత్వ సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్, జవహర్ నవోదయ విద్యాలయాల విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదివిన విద్యార్థులు ధరఖాస్తులు చేసుకోవచ్చు అని తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి 30వరకు వరకు ఈ-పాస్ (https://telanganaepass.cgg.gov.in)దరఖాస్తుతో పాటు పదో తరగతి పాస్ మెమో, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు పాస్ బుక్, అధార్ నంబర్, రేషన్ కార్డ్ నంబర్ వివరాలు జతజేయాలి. ఆన్‌లైన్‌లో ఈ-పాస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేటప్పుడు విద్యార్థులు ప్రాధాన్య క్రమములో మూడు కళాశాలలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రక్రియ ముగిసిన అనంతరం ఈ-పాస్ సిస్టమ్ ద్వారా విద్యార్థుల ఎంపిక ఆటోమేటిక్‌గా కళాశాలలు అలాట్ చేయబడతాయని తెలిపారు.

పోలీస్ కమిషనర్‌పై ఈసీ, డీజీపీకి ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, మే14: తన భర్త ఆకుల ప్రకాష్‌పై తప్పుడు కేసు నమోదు చేసి, జైలుకు పంపించారని ఆరోపిస్తూ ఈసీ, డీజీపీలకు ఫిర్యాదు చేసినట్లు కరీంనగర్ కార్పొరేటర్ ఆకుల పద్మ-ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ సీపీ ప్రత్యేకంగా ఎకనామిక్స్ అఫెన్స్ వింగ్ పేరిట ఏర్పాటు చేసి భూవివాదాలకు సంబంధించిన ఫిర్యాదులలో రాజకీయనాయకుల ప్రమేయం ఉన్న వాటిపైనే కేసులు నమోదు చేసి, అరెస్టులు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందులో భాగంగా తన భర్త ఆకుల ప్రకాష్‌పై 11 నెలల కిందట నమోదైన ఎఫ్ఐఆర్‌ను తిరిగి ఆల్టర్ చేసి అదనపు సెక్షన్‌లను పెట్టి కేసు నమోదు చేసి, అరెస్టు చేసి జైలకు తరలించారని పేర్కొన్నారు. తన భర్తపై నమోదైంది తప్పుడు కేసు అని, దీనిపై తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు. దీనిపై త్వరలో సీఎంకు విన్నవించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జైలు

కరీంనగర్ క్రైం, మే 14: విద్యుత్ చౌర్యం కేసులో పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం రొంపికుంటకు చెందిన పులిపాక రాజలింగకు పెద్దపల్లి జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి డి హేమంత్‌కుమార్ మంగళవారం జైలు శిక్ష లేదా జరిమానా చెల్లించాలని తీర్పు వెలువరించినట్లు ట్రాన్స్‌కో విజిలెన్స్ ఎస్ఐ ఎండీ షాదులాల్ల బాబా తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా విద్యుత్ చౌర్యంకు పాల్పడిన రాజలింగంకు 57,344 రూపాయల జరిమానా లేదా 3 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారని ఎస్ఐ తెలిపారు.

దశాబ్దాల కల.. నెరవేరిన వేళ

● వంతెన నిర్మాణం పూర్తి ● కొనసాగుతున్న రాకపోకలు ● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కొడిమ్యాల, మే 14: జగిత్యాల జిల్లా కొడిమ్యాల-నాచుపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావటంతో ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరింది. కొడిమ్యాల ఎంపీపీ స్వర్ణలత, జడ్పీటీసీ ప్రశాంతి కొడిమ్యాల-నాచుపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేయించాలని కోరటంతో గత ప్రభుత్వంలో బ్రిడ్జి నిర్మాణానికి డీ.ఎం.ఎఫ్.టీ నుంచి 4కోట్ల 80 లక్షల రూపాయలను మంజూరు చేయించారు. గతంలో వర్షాకాలం వచ్చిందంటే చాలు నాచుపల్లి-కొడిమ్యాల గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయేది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వరస్వామి దర్శనం చేసుకున్న భక్తులు, మండలంలోని నల్లగొండ శ్రీలక్ష్మీనర్సింహాస్వామి దర్శనం చేసుకొని జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దర్శనానికి కొడిమ్యాల-నాచుపల్లి గ్రామాల మధ్య ఉన్న లోలెవల్ కాజ్‌వే పైనుంచి రాకపోకలు సాగించే వారు. మండల కేంద్రానికి చెందిన పలువురు నిత్యం వ్యసాయ పనులకు ఇతర గ్రామాలకు, జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఇదే దారి గుండా వచ్చిపోతారు. బ్రిడ్జ్ నిర్మాణం కాక ముందు వర్షాకాలంలో పలు మార్లు వాహనాలు వరద నీటిలో ఇరుక్కున్న సందర్భాలు ఉన్నాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తికావడంతో సుమారు నెల రోజుల నుంచి ప్రయాణికులు బ్రిడ్జిపైనుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కొడిమ్యాల-నాచుపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జ్ నిర్మాణం పూర్తి కావటంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రానున్న వర్షాకాలం నుంచి వరదనీటి కష్టాలు తీరనున్నాయని ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వాగుపై నిర్మించిన బ్రిడ్జి

బ్రిడ్జ్ నిర్మాణంతో సంతోషంగా ఉంది

పర్లపెల్లి ఆనందం, రైతు, కొడిమ్యాల



నాచుపల్లి-కొడిమ్యాల గ్రామాల మధ్య ఉన్న వాగుపై బ్రిడ్జ్ నిర్మించడం సంతోషంగా ఉంది. బ్రిడ్జ్‌కు పాత రోడ్డుకు మధ్యలో మిగతా పని పూర్తి చేయాలి. మొరం కుప్పలను చదును చేయించాలి. బ్రిడ్జ్ నిర్మాణానికి కృషి చేసినవారందరికీ కృతజ్ఞతలు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



శ్రీచరణ్ (ఫైల్)

వేములవాడ టౌన్, మే 14: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. కొడిమ్యాల మండల తిరుమలాపూర్ గ్రామానికి చెందిన పన్యాల వాణిరాజు దంపతులు కొంత కాలంగా తమ ఇద్దరు కుమారులతో కలిసి వేములవాడలో నివాసం ఉంటూ జీవనోపాధి పొందుతున్నారు. ఫిబ్రవరి 10వ తేదీన ద్విచక్ర వాహనాన్ని సర్వీసింగ్ చేయించేందుకు చిన్న కుమారుడు శ్రీచరణ్ (18) కరీంనగర్ షోరూంకు వెళ్లాడు. సర్వీసింగ్ పూర్తి చేసుకుని తిరిగి వేములవాడకు వస్తున్న క్రమంలో ఉజ్వలపార్కు సమీపంలో వాహనం అదుపుతప్పి చెట్టుకు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మూడు నెలల పాటు శ్రీచరణ్ తలకు మూడుమార్లు ఆపరేషన్ చేసినా ఫలితం లేకపోవడంతో సోమవారం రాత్రి మృతి చెందగా మృతదేహం మంగళవారం ఇంటికి తీసుకువచ్చారు. తమ కుమారుడు తిరిగి ఇంటికి వస్తాడు అని ఆశించిన కుటుంబ సభ్యులు శక్తికి మించి కొడుకు కోసం రూ.కోటి ఖర్చు చేసినా ఫలితం లేకపోవడంతో తల్లిదండ్రుల రోదనలు చూసి పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం.. యువకుడి మృతి



ప్రసాద్ (ఫైల్)

సుల్తానాబాద్ మే 14: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధి పూసాల గ్రామానికి చెందిన యువకుడు మృతిచెందాడు. పూసాలకు చెందిన గొల్లపల్లి లక్ష్మీనారాయణ కుమారుడు ప్రసాద్(25) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రసాద్ హైదరాబాద్ నుంచి సుల్తానాబాద్ వచ్చాడు. తిరిగి సాయంత్రం హైదరాబాద్ వెళ్లాడు. అదేరోజు రాత్రి ప్రసాద్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గచ్చిబౌలి వద్ద ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొన్నప్రమాదంలో ప్రసాద్ మృతిచెందాడు.

చికిత్స పొందుతూ మాజీ జడ్పీటీసీ మృతి

జూలపల్లి, మే 14: జూలపల్లి మాజీ జడ్పీటీసీ సభ్యుడు, కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాటకుల నర్సయ్య(48) మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండల కేంద్రానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు పాటకుల నర్సయ్యను ఐదురోజుల క్రితం అతని ఇంట్లోనే రాత్రి నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తీవ్రంగా కొట్టి చిత్రహింసలకు గురిచేశారు. రక్తం మడుగులో అపస్మారక స్థితిలో పడి ఉన్న నర్సయ్యను గ్రామస్థులు గుర్తించి సమీప బంధువులకు తెలుపగా వారు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరింత మెరుగైన వైద్యం కోసం ప్రతిమ ఆసుపత్రిలో చేర్పి వైద్యం అందిస్తుండగా మంగళవారం మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

బావిలో పడి గొర్రెలకాపరి మృతి

జూలపల్లి, మే 14: మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన నిట్టు మల్లయ్య(65) అనే గొర్రెలకాపరి బావిలో పడి మృతిచెందినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. ఈ నెల 13న సోమవారం ఓటు వేసి ఇంటికి వచ్చిన మల్లయ్య గొర్రెలను మేతకు తీసుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో మల్లయ్య భార్య, బంధువులు వెతుకుతుండగా మంగళవారం అబ్బాపూర్ శివారులోని బావిలో పడి మల్లయ్య మృతిచెంది కనిపించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఓటింగ్‌లో హిందువులు ఐక్యత చాటారు

● ప్రభుత్వం హామీలపై దృష్టి సారించాలి ● బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 14: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో హిందువులు ఐక్యత చాటారని, హిందువులు ఏకమైతే ఫలితాలు ఎలా ఉంటాయో నిరూపించారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి నగరంలోని టవర్‌సర్కిల్ ప్రాంతంలో కార్యకర్తలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్‌లో బీజేపీని ఓడించేందుకు ముస్లిలంతా ఏకం కావాలంటూ కేసీఆర్ పిలుపునిచ్చారని, హిందువులంతా ఏకమైతే ఏ విధమైన ఫలితాలు వస్తాయో జూన్4వ తేదీన తెలిపోతుందన్నారు. ఆ రోజు ఫలితాలను చూసి తట్టుకునే శక్తి కేసీఆర్‌కు ఉండాలని కోరుకుంటున్నానన్నారు. ఆ రోజు ఇద్దరు డాక్టర్లను పక్కన పెట్టుకోవాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అధికారులు ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించారని, ఎన్నికల్లో ఓటు వినియోగించుకున్న ఓటర్లందరికీ ధన్యవాదాలు తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో గెలుపుపై విశ్వాసం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన కాంగ్రెస్ నాయకులు ఎన్ని అడ్డదారులు తొక్కినా ప్రజలు బీజేపీ పక్షాన నిలిచారన్నారు. కొన్ని ప్రాంతాల్లో కింది స్థాయి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారన్నారు. బీజేపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారని, లాఠీ ఛార్జీ సైతం చేశారన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీకి ఏవిధంగా నైతే పోలీసులు సహకరించారో అదే విధంగా కాంగ్రెస్ పార్టీకి కొంత మంది పోలీసులు సహకరించారన్నారు. హైదరాబాద్ కేంద్ర పాలిత ప్రాంతం విషయంలో పచ్చి అబద్ధాలాడారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ఎన్ని ప్రారంభించారు, వాటిపై శ్వేతపత్రం విడుదల చేయాల్సి ఉందన్నారు. 500 బోనస్ ఇవ్వలేదు. పేదలకు ఇస్తామన్న హామీలన్నీ అమలు చేయాలన్నారు. రైతులకు బోనస్ ఇస్తామని ప్రకటించి ఏమైందన్నారు. ఎంత మందికి ఇచ్చారు. మీరు ఏ విధంగా అందిస్తారో ప్రణాళిక ఏమిటని ప్రశ్నించారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు ఎంత ఖర్చు అవుతుంది, ఆదాయం ఎలా సమకూర్చుకుంటారని విధివిధానాలు తయారు చేసి అమలు చేయాలన్నారు. విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ చెల్లించక పోవడంతో కళాశాలల యాజమాన్యాలు తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారాన్నరు. ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికులకు ప్రతి నెల 1వ తేదీన జీతాలివ్వడంతో పాటు, వారికి పీఆర్‌సి, వారి బకాయి డీఏలు వెంటనే విడుదల చేయాలన్నారు.



టవర్ సర్కిల్‌లో కార్యకర్తలతో కలిసి టీ తాగుతున్న బండి సంజయ్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సృజన్ కుమార్ (ఫైల్)

మేడిపల్లి, మే 14: మేడిపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో సృజన్ కుమార్(46) అనే యువకుడు మృతి చెందాడు. మేడిపల్లికి చెందిన ఎన్నమనేని సృజన్‌కుమార్ మంగళవారం తెల్లవారుజామున కారులో కోరుట్ల మండలం గుములాపూర్ నుంచి మేడిపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సృజన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను చికిత్స నిమిత్తం 108లో జగిత్యాలలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి భార్య ప్రణవిరావు ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యామ్‌రాజ్ తెలిపారు. మరో 20 నిమిషాల్లో వస్తున్నా అని సృజన్ తన భార్యకు ఫోన్ చేసి చెప్పారని, సమయం దాటినా రాకపోయే సరికి జీపీఆర్ఎస్ లోకేషన్ చూసి కుటుంబీకులు సంఘటన స్థలానికి వెళ్లే సరికి ప్రమాదం జరిగి ఉందని కుటుంబీకులు తెలిపారు. అప్పటికే 108 వాహనం వచ్చిందని అందరూ కలిసి సృజన్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

కొండగట్టులో భక్తుల రద్దీ



ఆలయం వద్ద భక్తులు

మల్యాల, మే 14: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం మంగళవారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా భక్తులు వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. అంజన్నను దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఆలయంలో అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో చంద్రశేఖర ఇతర అధికారులు పర్యవేక్షించారు. కొబ్బరికాయలు కొట్టె చోట, భక్తులు తలనీలాలు సమర్పించే కేశఖండన మండపంలో భక్తుల నుంచి వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికే కొబ్బరికాయలు కొట్టే చోట వసూళ్లకు పాల్పడినట్లు భక్తుల ఫిర్యాదు మేరకు కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చిన్నట్లు పేర్కొన్నారు.

చిన్నబోనాలలో యువకుల వీరంగం

● ఇరువర్గాల మధ్య ఘర్షణ

సిరిసిల్ల రూరల్, మే 14: పార్లమెంట్ ఎన్నికలు నేపథ్యంలో సోమవారం పోలింగ్ ముగిసిన తరువాత యువకులు గంజాయి, మద్యం మత్తులో వీరంగం సృష్టించారు. ఈ సంఘటన సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాలలో చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొద్దిమంది యువకులు కొంత కాలంగా గంజాయితో పాటు మద్యానికి బానిస య్యారు. నిత్యం గ్రామంలో బైక్‌లను స్పీడ్‌గా నడిపిస్తూ ప్రజలను భయ బ్రాంతులకు గురిచేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓ పార్టీ తరుపున తిరిగిన యువకులు సోమవారం రాత్రి గంజాయి, మద్యం మత్తులో మరో పార్టీకి చెందిన వారి ఇళ్లకు వెళ్లి తలుపులు కోడు తూ ఇబ్బందులకు గురిచేశారు. ఈ సంఘటనపై గ్రామస్థులు స్థానిక వార్డు కార్యాలయం ఎదుట మంగళవారం సమావేశమయ్యారు. రాత్రి పూట ఇబ్బందులకు గురిచేసిన వారితో మాట్లాడుతుండగా ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ విషయాన్ని గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. టౌన్ సీఐ రఘుపతి గ్రామానికి చేరుకొని ఇరువర్గాలను శాంతిపజేశారు. సోమవారం రాత్రి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్నవారి స్నేహితులు సిరిసిల్ల నుంచి పెద్దఎత్తున వాహనాలపై గ్రామానికి వచ్చి పోలీసులను అడ్డుకు నేందుకు యత్నించారు. పోలీసులు వారిని అడ్డుకొని వారి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన పదిమందిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న పోలీసులు

కరీంనగర్ ఎంపీగా గెలువబోతున్నాం

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, మే14: కరీంనగర్ పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయసాధించనుందని ఆ పార్టీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ కంటే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం కాంగ్రెస్ పార్టీకి లాభిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పతకాలు అమలుపై ప్రజలు విశ్వాసం వ్యక్తం చేసి పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆదరించారన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు, సంక్షేమ పథకాలపై మహిళలు, పేదలు, రైతులు, వివిధ వర్గాల ప్రజలు చూపించిన ఆదరణ తన గెలుపుకు సహాయపడుతుందన్నారు.కాంగ్రెస్ పార్టీ తరుపున టికెట్ చివరి నిమిషంలో ఖరారు అయినప్పటికీ ప్రచారంలో రాకెట్‌లా దూసుకుపోయి పార్లమెంట్ నియోజకవర్గంలోని 40మండలాలను చుట్టి వచ్చామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా రెండు చోట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనజాతర సభలు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్‌షోలు గ్రామాలలో సభల ద్వారా నియోజకవర్గంలోని దాదాపు 18లక్షల ఓటర్లలో 15లక్షల మంది ఓటర్లను కలిశామన్నారు. రాష్ట్రమంత్రి పొన్నం ప్రభాకర్ ఈ ఎన్నికల్లో 7అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ తరుపున విశ్వేశ్వరుడిలా తిరిగి కార్నర్ మీటింగ్, సమావేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించారని అన్నారు. ప్రచారంలో 15రోజుల పాటు అలుపెరుగకుండా కష్టపడిన జిల్లా మంత్రి, పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు,టీపీసీసీ నాయకులు, డీసీసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగలైన మండల, గ్రామాల నాయకులకు వెలిచాల రాజేందర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్యనారాయణగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆకారపు భాస్కర్‌రెడ్డి, నాయకులు వైద్యుల అంజన్‌కుమార్, పద్మాకర్‌రెడ్డి, ఆకుల ప్రకాష్, పిట్టల రవీందర్, చింతల కిషన్, దిండిగాల మధు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెలిచాల రాజేందర్‌రావు

మోరపల్లిలో అగ్ని ప్రమాదం : రూ.1.50లక్షల నష్టం

జగిత్యాలరూరల్,మే14: జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలో బేతి రాంమోహన్‌రెడ్డికి చెందిన కొట్టంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కొట్టంలో ఉన్న గడ్డికట్టలు పూర్తిగా కాలిపోగా సుమారు రైతుకు రూ. 1.50 వేల ఆస్తినష్టం సంభవించినట్లు రైతు రాంమోహన్‌రెడ్డి తెలిపారు.

కందకంలో పడి వృద్ధుడి మృతి

ధర్మపురి, మే 14: ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట గ్రామానికి చెందిన బద్ది మల్లయ్య (70) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తు కందకంలో పడి మృతి చెందాడు. ఈ నెల 5న తునికాకు సేకరణ కోసం ఉదయం 6 గంటలకు జంగల్‌కు వెళ్లిన మల్లయ్య ఇంటికి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం బూరుగుచెట్ల ఏరియా జంగల్‌లోని కందకంలో ప్రమాదవశాత్తు పడి చనిపోయి ఉన్నాడు. మల్లయ్య కొడుకు బద్ది భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

అప్పుడు నాటారు.. ఇప్పుడు నరుకుతున్నారు

● హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం ● విద్యుత్ తీగలకు అడ్డు వస్తున్నాయని తొలగింపు



బుగ్గరాజేశ్వరతండా రోడ్డు పక్కన నరికేసిన చెట్లు



సుద్దాలలో నిరసన వ్యక్తం చేస్తున్న బ్లెస్సీ



సుద్దాలలో చెట్లు నరికివేస్తున్న విద్యుత్ సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, మే 14: పల్లెల్లో పచ్చదనం పంచేందుకు ఏడేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం హరితహారం పథకం కింద మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు బుగ్గరాజేశ్వరతండా, గొల్లపల్లి, బొప్పాపూర్, తదితర గ్రామాల్లో విద్యుత్తు తీగల కింద మొక్కలను నాటి సంరక్షించారు. ప్రస్తుతం ఏపుగా పెరిగి పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఇప్పుడు విద్యుత్ తీగలకు అడ్డు వస్తున్నాయని చెట్లను నరికి వేస్తున్నారు. దారి పొడువునా ఆకట్టుకునే పచ్చని చెట్లపై గొడ్డలి వేటు వల్ల చెట్లు మొదళ్లతో దర్శనమిస్తున్నాయి. అప్పుడు నాటుడెందుకు.. ఇప్పుడు నరకడమెందుకని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముందు చూపు లేకపోవడంతో ఏపుగా పెరిగిన పచ్చని చెట్లు నేలకూలుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.

కోనరావుపేట: మండలంలో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటగా అవి ఏపుగా పెరిగాయి. చెట్లు ప్రగతికి మెట్లు అన్నట్లుగా ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలను పెంచింది. కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి పెంచిన చెట్లను నరికేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ శివారులో రోడ్డుకు ఇరుపక్కల మొక్కలు నాటగా అవి వృక్షాలుగా మారాయి విద్యుత్తు తీగలకు తగులుతున్నాయని ఏకంగా చెట్లని పూర్తిగా నరికేస్తున్నారు విద్యుత్ తీగలకు తగలకుండా కొమ్మలను నరికేస్తే సరిపోతుంది కానీ పెరిగిన చెట్లు వేసవిలో నీడను ఇస్తూ ఆహ్లాదం కలిగిస్తున్న చెట్లను నరికేస్తున్నారు

సీఎం సార్.. చెట్లను కాపాడండి

- ప్రకృతి ప్రేమికురాలు చిన్నారి బ్లెస్సీ

కోనరావుపేట: 'సీఎం సార్.. చెట్లను కాపాడండి. హరితహారంలో భాగంగా మొక్కలు నాటుతూ వస్తుంటే కొంతమంది నరికేస్తున్నారు' అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాలకు చెందిన ప్రకృతి ప్రేమికురాలు చిన్నారి బ్లెస్సీ కోరింది. మంగళవారం గ్రామంలో ఫ్లకార్డుతో నిరసన తెలిపింది. మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన ప్రకృతి ప్రేమికుడు డి.ప్రకాష్ కూతురు బ్లెస్సీ. హరితహారంలో భాగంగా ఏటా విత్తనాలను సేకరించి వాటిని మట్టితో బాల్స్ తయారు చేసి అడవుల్లో తండ్రి సహాయంతో చల్లుతోంది. అయితే హరితహారంలో భాగంగా అధికారులు కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ శివారులో రోడ్డుకు ఇరుపక్కల మొక్కలు నాటి సంరక్షించారు. ఏపుగా పెరిగి విద్యుత్ తీగలకు తగులుతున్నాయని సంబంధిత అధికారులు సిబ్బందితో చెట్లను కింది వరకు నరికివేయిస్తున్నారు. దీంతో ఆవేదన వ్యక్తం చేసిన బ్లెస్సీ చెట్లను నరికేస్తున్నారని, కాపాడాలని కోరింది.

వైభవంగా నృసింహ నవరాత్రోత్సవాలు

● రెండో రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు



స్వామివారి దర్శనం చేసుకుంటున్న భక్తులు

ధర్మపురి, మే 14: ధర్మపురి లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో రెండవ రోజు మంగళవారం నృసింహ నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల మధ్య అర్చకులు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన, పంచోపనిషత్తులచే రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సామవేద పారాయణంతో అభిషేక పూజలు, వాస్తు, యోగిని, క్షేత్రపాలక, నవగ్రహ, సర్వతోభద్ర మండల, స్థాపిత దేవతా పూజలు, సహస్ర వరుణ, కలశ స్థాపన, స్థాపిత దేవత హోమాలు, శ్రీ స్వామి వారలకు తులసీ అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. వేసవి సెలవు దినాలు కావటం వల్ల గోదావరిలో స్నానాలు ఆచరించిన అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి ని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, సీహెచ్ రమణయ్య, నరసింహమూర్తి, నేరెళ్ల సంతోష్‌కుమార్, ఒద్దిపర్తి కళ్యాణ్, సముద్రాల వంశీ, చక్రపాణి కిరణ్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్ కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో కాత్యాయనీ కల్యాణ వ్రతం



ఉత్సవమూర్తులతో పెద్దమ్మ ఆలయం వద్ద భక్తులు

మెట్‌పల్లి, మే, 14: పట్టణంలోని బంగారు పెద్దమ్మ ఆలయంలో కాత్యాయనీ కల్యాణ వ్రతాన్ని ఘనంగా జరిపించారు. మంగళవారం ఆలయంలో బంగారు తల్లి అమ్మవారికి, శ్రీవల్లి దేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకాలు, లక్ష్మీదేవి పూజలు తదితర కార్యక్రమాలను ఆలయ పురోహితుడు మదన్‌శర్మ జరిపారు. అనంతరం ఉత్సవ మూర్తులతో భక్తులు పెద్దమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి ఆలయంలో ఏర్పాటు చేయగా ఐశ్వర్య సిద్ధి, సకల కార్యసిద్ధి కోసం అపారమైన ధనలక్ష్మీ అమ్మవారికి పుష్పార్చనలతో అభిషేకాలు, పూజలు తదితర కార్యక్రమాలతో పాటు కుంకుమ పూజలు నిర్వహించారు. పురోహితుడి మంత్రోచ్చరణ మధ్య పూజలు నిర్వహించారు. భక్తులచే కుజదోష నివారణ కోసం సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం భక్తులు ఆలయ సమీపంలోని శ్రీ ఐశ్వర్య లక్ష్మి గోశాలలోని గోమాతలకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు జరిపి వాటికి ఆహారం అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. గోశాలలో వసంతోత్సవ కార్యక్రమాలను జరిపిన అనంతరం అమ్మవారి పసుపు కొమ్ము, గాజులు, పండ్లను భక్తులకు పురోహితుడు ప్రసాదంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ సిద్దియోగ ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న కేటీఆర్

గంభీరావుపేట, మే 14 : గంభీరావుపేట మండలం గోరంటాలలో రేణుకా ఎల్లమ్మ సిద్దియోగ ఉత్సవాలు కొన సాగుతున్నాయి. మంగళవారం ఎల్లమ్మ, జమదగ్నిల కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఎల్లమ్మ కల్యాణ మహోత్సవానికి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారిని దర్శించుకున్నారు. బీఆర్ఎస్ నేతలు, స్థానిక గౌడ సంఘం నాయకులు ఉన్నారు.

కళాశాల అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్

వేములవాడ టౌన్, మే 14 : ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశాన్ని మంగళవారం కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు రాధాకృష్ణమాచార్యులు, గడ్డం సత్యనారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయన్నారు. విద్యార్థులు కళాశాలలో చేరేందుకు కృషి చేయాలని కోరారు. కళాశాలలో ప్రతీ సంవత్సరం బంగారు పథకాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ సంవత్సరం జరగబోయే బంగారు పథకాల ప్రధానోత్సవ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు చేదోడువాదోడుగా నిలవాలని కోరారు. అనంతరం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గత సంవత్సరం బంగారు పతకాల ప్రధానోత్సవం నిర్వహించిన మాదిరిగానే ఈ సంవత్సరం వైభవంగా నిర్వహించాలని, దానికి పూర్వ విద్యార్థుల సంఘం అన్ని రకాలుగా సహకరిస్తుందని, ఈ నెలలోనే కార్యక్రమం ఏర్పాటు చేయాల్సిందిగా ప్రిన్సిపాల్‌కు సూచించారు. ఈ సమావేశంలో వాసరవేని పర్శరాములు, జయవర్ధన్ తదితరులు ఉన్నారు.

తేనెటీగల దాడి

ఎల్లారెడ్డిపేట, మే 14: ఎల్లారెడ్డిపేట మండలం గుండారంలోని గుట్టపై ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయం ఆవరణలో మంగళవారం తేనెటీగలు దాడి చేసిన ఘటనలో చందుర్తి మండలం తిమ్మాపూరం గ్రామానికి చెందిన న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు పిట్టల భూమేశ్‌తోపాటు ఎల్లారెడ్డిపేటలోని ఆ పార్టీ నాయకులు బానోతు రాజునాయక్, అనుప గణేశ్, ఎడ్ల రాజ్‌కుమార్ అస్వస్థతకు గురయ్యారు. మండల కేంద్రంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. గుండారంలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయ వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాలకు స్థానిక నాయకులతో కలిసి న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు పిట్టల భూమేశ్ హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుట్టపైకి వెళ్తున్న క్రమంలో బండరాయికి ఉన్న తేనెతుట్టె భూమేశ్ తలకు తలగడంతో ఒక్కసారిగా దాడికి చేశాయి. భూమేశ్‌కు మండల కేంద్రంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రాజునాయక్, గణేశ్, రాజుకుమార్ స్వల్ప అస్వస్థతకు లోనయ్యారు.

ప్రలోభ పెట్టినా విజయం కాంగ్రెస్‌దే



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట, మే 14: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ ఓటర్లను ప్రలోభ పెట్టినా విజయం కాంగ్రెస్‌దేనని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ ఆ రెండు పార్టీలు పంచిన డబ్బులను తీసుకొని కాంగ్రెస్‌కు ఓటు వేశారన్నారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న పథకాలకు ప్రజలు పట్టం కట్టారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. 25 రోజులుగా పార్టీ గెలుపునకు కష్టపడిన ప్రతీ కార్యకర్తకు ధన్యావాదాలు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలను ప్రజలకు వివరిస్తూ మరింతా చేరువ కావాలన్నారు. ప్రజా సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం, ప్రజలకు వారధిగా పని చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని దొమ్మాటి నర్సయ్య సూచించారు. నాయకులు లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, గౌస్, లింగాగౌడ్, గిరిధర్‌రెడ్డి, రాజునాయక్, రవి, రఫీక్, రాంరెడ్డి, కృష్ణమూర్తి, రాజయ్య రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాములు, బుచ్చాగౌడ్, దేవయ్య, మల్లారెడ్డి, రామచంద్రం, బాల్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

కేటీఆర్ రాజీనామా చేయాలి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, మే 14 : దిగజారుడు రాజకీయాలకు దిగినందుకు బాధ్యత వహిస్తూ కేటీఆర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని, మళ్లీ ఎన్నికలకు రావాలని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓడిపోతామేమోనన్న భయంతో ఎన్నికల విధానాన్ని అపహాస్యం చేసే విధంగా ఎమ్మెల్యే కేటీఆర్ సిరిసిల్ల నియోజకవర్గంలో డబ్బు, మద్యం పంపిణీ చేశారని ఆరోపించారు. మద్యం, డబ్బులు పంపిణీ చేయబోనని, పోలీసులను వాడుకోనని చెప్పిన నేతి బీరకాయ మాటలను తుంగలో తొక్కారన్నారు. నిన్నటి ఎన్నికల్లో కేటీఆర్ మద్యం, డబ్బులను పంపిణీ చేశారని సిరిసిల్ల నియోజకవర్గం ప్రజలు కోడైకూస్తున్నారన్నారు. తంగళ్లపల్లి మండలం పద్మనగర్, సిరిసిల్ల పట్టణంలో బీఆర్ఎస్ 16వార్డు కౌన్సిలర్ మద్యం, డబ్బులు పంచుతుండగా పోలీసులు, ఎన్నికల అధికారులు పట్టుకొని కేసులు పెట్టారని, దీనిపై కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లను నిజంగా అభివృద్ధి చేస్తే ఇటువంటి దిగజారుడు రాజకీయాలకు ఎందుకు పాల్పడ్డారో చెప్పాలన్నారు. చేసిన అభివృద్ధిపై కేటీఆర్‌కు నమ్మకం ఉంటే ఓటర్లు తప్పకుండా గుర్తించేవారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పట్టుకోల్పోయి మూడో స్థానం వస్తుందనే భయంతో డబ్బులు, మద్యం పంపిణీ చేశారన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ఆరు నియోజకవర్గాల్లో మద్యం, డబ్బులు పంచారని ఎక్కడా ఎవరూ అనలేదన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో మద్యం, డబ్బులు పంపిణీ చేశారని ఓటర్లే చెబుతున్నారన్నారు. కేటీఆర్‌కు నిజంగా ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంటే దిగజారుడు రాజకీయాలకు దిగినందుకు బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని, మళ్లీ ఎన్నికలకు రావాలని అన్నారు. ఈ సమావేశంలో టీపీసీసీ సభ్యుడు నాగుల సత్యనారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళ అశోక్, కౌన్సిలర్లు రెడ్యానాయక్, కుడికాల రవికుమార్, రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బైరి ప్రభాకర్, నాయకులు వంగరి దేవదాస్, భీమారపు శ్రీనివాస్, వైద్య శివప్రసాద్ పాల్గొన్నారు.

ఇక రిలాక్స్ అవుదాం..

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ముగిసింది. ఇన్నాళ్లు హోరాహోరీగా ప్రచారం నిర్వహించిన నేతలు మంగళవారం రిలాక్స్ అయ్యారు. ఎంపీ, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ తన మేనళ్లుడితో కలిసి కరీంనగర్‌లో ద్విచక్ర వాహనంపై చక్కర్లు కొట్టారు. ఓ బేకరీకి వెళ్లి స్నాక్స్ తిన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు తన నివాసంలో కుటుంబసభ్యులతో గడిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ పార్టీ నాయకులతో మాట్లాడారు. ఆయా నియోజకవర్గాల్లో పోలింగ్ సరళిపై చర్చించారు.

■ స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, కరీంనగర్



అల్లుడు శ్రీనిక్‌తో కలిసి కేక్ తింటున్న సంజయ్‌కుమార్



స్నాక్స్ తింటున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు



పోలింగ్ సరళిపై చర్చిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్

పోలింగ్ 72.54 శాతం

● 3.24శాతం పెరిగిన ఓటింగ్ ● ఓటేసిన 13,03,690 మంది



కరీంనగర్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న ఓటర్లు (ఫైల్)

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 13,03,690 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్ చేసిన ప్రయత్నాలు కొంత మేరకు ఫలించాయి. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు ఓట్లు వేస్తారో లేదో, గత ఎన్నికల్లో కంటే పోలింగ్ తక్కువగా కావచ్చని అందరూ భావించారు. అంచనాలను తారుమారు చేస్తూ గత ఎన్నికల కంటే ఎక్కువ పోలింగ్ నమోదైంది. 2019 ఎన్నికల్లో 69.3 శాతం పోలింగ్ జరుగగా ఈసారి 3.24 శాతం ఓటింగ్ అధికంగా అయింది. పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో మొత్తం 17,97,150 ఓట్లు ఉండగా 13,03,690 మంది ఓటు వేశారు. 6,34,663 మంది పురుషులు కాగా, 6,68,982 మంది మహిళలు, 45 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో అత్యధికంగా 77.75, కరీంనగర్ నియోజకవర్గంలో కేవలం 60.51 శాతం ఓటింగ్ జరిగింది.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ వివరాలు

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
కరీంనగర్	3,67,353	2,22,296	60.51
చొప్పదండి	2,33,546	1,76,001	75.36
వేములవాడ	2,26,188	1,68,373	74.44
సిరిసిల్ల	2,46,547	1,85,573	75.27
మానకొండూర్	2,25,386	1,75,228	77.75
హుజూరాబాద్	2,50,429	1,84,858	77.25
హుస్నాబాద్	2,47,701	1,91,361	77.25

● జూన్ 4న ఓట్ల లెక్కింపు:

జూన్ 4న జరిగే పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. సోమవారం అర్ధరాత్రి వరకు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి, మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ అభిషేక్ మోహంతి నేతృత్వంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్ వేసి ఈవీఎంలను భద్రత పరిచారు. 21 రోజుల తర్వాత ఓట్ల లెక్కింపు ఉండడంతో ఫలితాలపై అంతా ఉత్కంఠతో ఉన్నారు. అఈసారి ఓటింగ్ శాతం పట్టణాల కంటే పల్లెల్లో పెరుగడం, మహిళల ఓట్లు అధికంగా పోల్ కావడంతో ఆ ఫలితాలు ఎవరికి అనుకూలంగా వస్తాయోనన్న చర్చ జరుగుతోంది. పెరిగిన పోలింగ్ తమకు అనుకూలమనే అభిప్రాయంతో ప్రధాన పార్టీ అభ్యర్థులంతా గెలుపుపై ధీమాతో ఉన్నారు.

హుజూరాబాద్ నియోజకవర్గంలో తగ్గిన పోలింగ్

● అసెంబ్లీలో 83.19 శాతం నమోదు..
● పార్లమెంట్‌లో 73.82 శాతం మాత్రమే...

హుజూరాబాద్, మే 14: హుజూరాబాద్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ శాతం తగ్గింది. గత నవంబరులో హుజూరాబాద్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగగా ఐదు మండలాల్లో 83.19 శాతం పోలింగ్ నమోదైంది. పార్లమెంట్ ఎన్నికలకు వచ్చే సరికి 73.82 శాతం మాత్రమే పోలింగ్ నమోదైంది. దీనికి ఎండల తీవ్రత ఎక్కువ కావడం కారణం. పార్లమెంట్ అభ్యర్థులు ప్రచారాన్ని పట్టణాలకే పరిమితం చేయడం మరో కారణం. దీనికి తోడు ఏడు నియోజకవర్గాలు ఉండడంతో అభ్యర్థులకు సమయం సరిపోలేదు. గ్రామాల్లోని కార్యకర్తలు కూడా అంతంత మాత్రంగానే ప్రచారం నిర్వహించారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో 2,50,429ఓటర్లు ఉండగా 1,84,858 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుషులు 92,257, మహిళలు 92,597, ఇతరులు నలుగురు ఓట్లు వేశారు. హుజూరాబాద్ మండలంలో 64,666 ఓట్లు ఉండగా, పురుషులు 23,517, మహిళలు 24,188, ఇతరులు 3, మొత్తం 47,708, వీణవంక మండలంలో 42,514 ఓట్లు ఉండగా, పురుషులు 16,429, మహిళలు 16,272, ఇతరులు ఒక్కరు, మొత్తం 32,702 మంది ఓటు వేశారు. జమ్మికుంట మండలంలో 62,665 ఓట్లు ఉండగా, పురుషులు 22,407, మహిళలు 22,078 మొత్తం 44,485 మంది, ఇల్లందకుంట మండలంలో 25,129 ఓట్లు ఉండగా, పురుషులు 9,514, మహిళలు 9,491 మొత్తం 19,005 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కమలాపూర్ మండలంలో 55,455 ఓట్లు ఉండగా, పురుషులు 20,390, మహిళలు 20,568, మొత్తం 40,958మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఉపాధ్యాయులపై లాఠీచార్జి అమానుషం





సిరిసిల్లలో మాట్లాడుతున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, మే 14:నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధు లను నిర్వర్తించిన ఉపాధ్యాయులకు రావాల్సిన భత్యానికి సంబందించి రాష్ట్ర వ్యాప్తంగా ఏక రీతిగా ఇవ్వాలని డిమాండ్ చేసిన వారిపై పోలీసులు లాఠీచార్జి చేయడం అమానుషమని టీపీటీఎఫ్ నాయకులు అన్నారు. సిరిసిల్లలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దోర్నాల భూపాల్‌రెడ్డి, దుమాల రమనాథ్‌రెడ్డి మాట్లాడారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలో విధులను నిర్వర్తించిన ఉపాధ్యాయులపై అక్కడి ఆర్డీవో లాఠీచార్జి చేయించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

● ఎన్నికల విధులను నిర్వర్తించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన ఆర్డీవోపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిరిసిల్లలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్‌గౌడ్ మాట్లాడారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికలను నిర్వర్తించిన ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు లాఠీచార్జి చేశారన్నారు. ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన ఆర్డీవోతోపాటు పోలీసులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని పీవో, ఏపీవోలకు రోజుకు రూ.600, ఓపీవోలకు రూ.400 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 61ని ఈ నెల 11న విడుదల చేసిందన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారమే మెదక్ నియోజకవర్గం పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో పీవో, ఏపీవోలకు రూ.3150 చెల్లించిందని, నారాయణ ఖేడ్‌లో రూ .2400 మాత్రమే ఇచ్చిందని అన్నారు. ఈ విషయమై ఒకే పార్లమెంట్ నియోజకవర్గంలో రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించనందుకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డితోపాటు ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీవో ఆదేశాలమేరకు పోలీసులు లాఠీచార్జి చేశారన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి గుండమనేని మహేందర్‌రావు, ఉపాధ్యక్షుడు అంబటి రమేష్, కోశాధికారి రవీందర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ మల్లేశం, కార్యదర్శులు శివ కుమార్, స్వామి, రాజు, మల్లేశం, ప్రవీణ్, బాస్కర్, తిరుపతి జాదవ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

భీమారం మే 14: మండలంలోని మోత్కురావుపేట గ్రామానికి చెందిన భూమల్ల గణేష్ దుబాయ్‌లోని అలెన్ ఏరియాలో ప్రమాదవశాత్తు మ్యాన్ హోల్‌లో పడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ మంగళవారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. మృతదేహాన్ని త్వరగా తీసుకొచ్చేందుకు సంబంధిత అధికారులతో మాట్లాడి, వారి కుటుంబసభ్యులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

చొప్పదండి: మండలంలోని గుమ్లాపూర్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోలపురి మల్లేశం ఇటీవల వడదెబ్బతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మంగళవారం పరామర్శించారు. అనంతరం కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. చొప్పదండి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుర్రం ఏసురెడ్డి, తొగురుమామిడి కుంటకు చెందిన మంగళపల్లి అనసూర్య మరణించగా బాధిత కుటుంబాలను పరామర్శించారు.

బాధితుడికి బండి సంజయ్ పరామర్శ

కథలాపూర్, మే 14 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలోని చింతకుంటలో చోటు చేసుకున్న ఘర్షణలో గాయపడ్డ నేతుల మల్లేశ్‌ను మంగళవారం ఎంపీ బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు టాటా ఏస్ వాహనాన్ని ఎక్కించి గాయపరచగా కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించిన విషయం తెలుసుకుని పరామర్శించారు. న్నికల నియమావళిని ఉల్లంఘించి దాడులకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

‘డబుల్’ సమస్యలు

- పగుళ్లు చూపిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు
- గదుల్లో ధ్వంసమైన ఫ్లోరింగ్
- తాగు నీటి పైపుల లీకేజీ



గదిలో ధ్వంసమైన ఫ్లోరింగ్

ఎల్లారెడ్డిపేట, మే 14: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో సమస్యలు తాండవిస్తున్నాయి. దీంతో కాలనీవాసులు అవస్థలు పడుతున్నారు. పనుల్లో నాణ్యత లేక పోవడంతో ఇళ్ల భవనాల్లో గోడలు పగుళ్లు చూపుతున్నాయి. గదుల్లో ఫ్లోరింగ్ ధ్వంసమై ఇసుక తేలుతోంది. తాగు నీటి పైపులు లీకవుతుండడం వల్ల ఇళ్ల పైపుల చుట్టు నాచు పేరుకుపోయింది. గదుల్లో గోడలకు తడి వస్తోంది. మురుగు నీరు వెళ్లే మార్గం లేక ఇళ్ల చుట్టూ కంపు చేరుతోంది.

పగిలిన ఫ్లోరింగ్.. ఊడిన కిటికీల అద్దాలు

మండలంలోని వెంకటాపూర్ శివారులో గత ప్రభుత్వం ఇళ్ల లేని 40 మంది నిరుపేద లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించింది. రెండేళ్ల కిందట అప్పటి మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా పంపిణీ చేసింది. అధికారులు ఐదు బ్లాక్‌లలో 40 మందికి ఇళ్లను కేటాయించారు. ఎంతో ఆనందంతో గృహప్రవేశం చేసిన పేదలకు ఆది నుంచే కష్టాలు మొదలయ్యాయి. ఇళ్లలోని కిటికీల అద్దాలు ఊడిపోవడం.. నాణ్యత లేకపోవడంతో గదుల్లో ఫ్లోరింగ్ ధ్వంసమై ఇళ్లలో ఉండేందుకు పేదలు అవస్థలు పడుతున్నారు. ఇళ్లలోని గదుల్లో గోడలకు తడి వస్తోంది. వర్షాకాలంలో పరిస్థితి దారుణంగా ఉంటుందని కాలనీవాసులు వాపోతున్నారు. కొన్ని ఇళ్లలో గదులు పగుళ్లు చూపాయి. గత్యంతరం లేక కొందరు ఫ్లోరింగ్‌కు మరమ్మతు చేయించుకుంటున్నారు. కూలీ పనులు చేసే మరికొందరు డబ్బులు లేక గుంతల్లోనే కాలం వెల్లదీస్తున్నారు.

దరి చేరని భగీరథ..
డ్రైయినేజీ అస్తవ్యస్తం

డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలో 40 కుటుంబాల్లో సుమారు 200 మంది జీవిస్తున్నారు. మిషన్ భగీరథ పేదల దరి చేరలేదు. ఇళ్ల సమీపంలో ఉన్న బోరు మోటారే దిక్కుగా మారింది. భవనం పైనున్న ట్యాంకుల ద్వారా ఇళ్లకు నీరు సరఫరా అవుతోంది. తాగు నీటి పైపులు లీకవుతుండడంతో ఇళ్లపై నుంచి కింది వరకు నాచు పేరుకుపోయి నీరు కలుషితమవుతోంది. మురుగు నీరు వెళ్లేందుకు అంతర్గతంగా వేసిన పైపులు పగిలిపోవడంతో నీరంతా ఓ చోట చేరుతోంది. దోమలు, ఈగలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు వెలుగక చీకటి పూట బయటకు వెళ్లాలంటే జంకుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా డబుల్ ఇళ్లలో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.





డబుల్ ఇళ్ల గదిలోని గోడకు వచ్చిన తడి, నిలిచిన మురుగు నీరు

ఆరు నెలలకే ఫ్లోరింగ్ ధ్వంసం

- విక్రుతి సావిత్రి



మేం వచ్చిన ఆరు నెలలకే డబుల్ బెడ్ రూం ఇళ్లలోని ఫ్లోరింగ్ పగిలిపోయింది. పెద్ద పెద్ద గుంతలు పడితే రూ.30 వేలు అప్పులు చేసి మరమ్మతు చేయించుకున్నా. వానొస్తే ఇళ్లు ఉరుస్తోంది. కిటికీల అద్దాలు ఊడిపోయాయి. దోమలు రాకుండా అట్టలను అడ్డుగా పెట్టుకున్నాం. అధికారులు మరమ్మతు చేయించాలి.

గుంతల్లోనే కాలం వెల్లదీస్తున్నాం

- కడమంచి లక్ష్మీ



మాకు ఇల్లొచ్చిందంటే సంతోష పడ్డాం. కొన్ని రోజులకే బాత్‌రూం డోర్లు ఊడిపోయినయ్. ఇంట్లోని గోడలకు తడి వస్తోంది. గచ్చు పూర్తిగా లేచి పోయి గుంతలు ఏర్పడ్డాయి. కూలీ పనులు చేసుకునే తమకు మరమ్మతు చేయిస్తామంటే పైసలు లేవు. వీలు లేక ఏర్పడిన గుంతలతోనే బతుకు వెళ్లదీస్తున్నాం.

ఏ కాలమైనా తడి వస్తోంది

- పోష ఎల్లవ్వ



డబుల్ బెడ్ రూం ఇంటిలో ఏ కాలమైన గోడలకు తడి వస్తోంది. వాన కాలంలో ఉరుస్తున్నాయి. అన్ని గదుల్లో ఫ్లోరింగ్ లేచి పోతోంది. జోర సంచులు(గన్నీ) వేసుకుంటున్నాం. ట్యాంకుల నుంచి వచ్చే నీరు బయటకు వెళ్లేందుకు సరైన దారి లేకపోవడంతో నాచు పడుతోంది. మరమ్మతు చేయించి సమస్య పరిష్కరించాలి.

పారిశుధ్య పనులు చేపడుతాం

- ఆరేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి



వెంకటాపూర్ శివారులోని డబుల్ బెడ్ రూం ఇళ్లలో నెల కొన్న అపరిశుభ్రతను తొలగిస్తాం. పగిలిన డ్రైయినేజీ పైపులకు మరమ్మతు చేయిస్తాం. తడి, పొడి చెత్త వేయడానికి ప్రతీ బుధవారం జీపీ ట్రాక్టర్‌ను పంపిస్తాం. ఇళ్ల మధ్య నిల్వ ఉన్న మురుగు నీటిని తొలగించి పారిశుధ్య చర్యలు చేపడుతాం.